www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 26 ఆగస్టు 2025

5

పశ్చిమ గోదావరి

తగ్గిన వశిష్ట గోదావరి ఉధృతి

పంటు రాకపోకలు పునరుద్ధరణ

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురంలో వశిష్ట గోదావరి ఉధృతి తగ్గింది. గత నాలుగు రోజులుగా ఉధృతంగా ప్రవహిస్తూ భయపెట్టిన గోదావరి నీటిమట్టం సోమవారం భారీగా తగ్గింది. వలంధర రేవు, లలితాంబ ఘాట్, పడవలరేవు ప్రాంతాల్లో నీటిమట్టం సాధారణ స్థాయికి చేరింది. దీంతో గోదావరి పరివాహక ప్రాంత వాసులు ఊపిరి పీల్చుకున్నారు. పడవలరేవులో గత 5 రోజులుగా నిలిచిపోయిన పంటు రాకపోకలు పునరుద్ధరించారు. దీంతో పెద్ద ఎత్తున పంటుపై జనం ప్రయాణాలు చేశారు. చించినాడ వంతెనపై మరమ్మత్తుల కారణంగా వాహనాల రాకపోకలు పూర్తిగా నిలుపుదల చేయడంతో నరసాపురం నుంచి పంటుపై ప్రయాణాలు పెరిగాయి. దీంతో పంటు రేవు వద్ద విపరీతమైన రద్దీ నెలకొంది. మూడు పంటులు తిప్పినా కూడా గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. పంటు రేవు ప్రయాణికుల క్యూ పెద్ద ఎత్తున కనిపించింది.

మొక్కజొన్న కంపెనీల మోసాలు..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మొక్కజొన్న రైతులను పలు సీడ్స్ కంపెనీలు నిలువునా ముంచేస్తున్నా అడిగే నాథుడే లేకుండాపోయాడు. ప్రతియేటా వందలాది మంది రైతులు కంపెనీలు ఇస్తున్న సీడ్స్‌తో తీవ్ర నష్టాలను మూటగట్టుకుని అప్పుల పాలవుతున్నారు. సీడ్స్ కంపెనీలు యథేచ్ఛగా రైతులను మోసగిస్తున్నా ప్రభుత్వంగాని, అధికారులకుగాని పట్టించుకోని పరిస్థితి నెలకొంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలోని మెట్ట ప్రాంతంలో అతిపెద్దసాగుగా మొక్కజొన్న ఉంది. దాదాపు లక్షకుపైగా ఎకరాల్లో మొక్కజొన్న సాగును రైతులు చేస్తున్నారు. ప్రతియేటా సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో మొక్కజొన్న సాగు మొదలవుతోంది. జిల్లాలోని మొక్కజొన్న సాగులో అత్యధిక కంపెనీలు ఇచ్చే సీడ్స్‌తోనే సాగు చేస్తున్నారు. కమర్షియల్ (వాణిజ్య) సాగు అతితక్కువగా సాగుతోంది. పలు సీడ్స్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు గ్రామాల్లోని రైతుల వద్దకు వెళ్లి తమ కంపెనీ సీడ్స్ పెద్దఎత్తున దిగుబడి వస్తుందని చెప్పి రైతులకు అంటగడుతున్నారు. కంపెనీలకు చెందిన ప్రతినిధుల మాటలు నమ్మి ఆయా కంపెనీల సీడ్స్‌ను రైతులు సాగు చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట చివరిలో దిగుబడి రాకపోవడంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. నాలుగైదు టన్నులు వస్తుందని నమ్మబలుకుతూ ఇచ్చిన సీడ్స్ సైతం టన్ను, టన్నున్నర మాత్రమే దిగుబడి వస్తున్నాయి. ఎకరాకు 30 వేలకుపైగా కౌలు, పెట్టుబడి ఎకరాకు రూ.50 వేల వరకూ రైతులు పెడుతున్నారు. రూ.80 వేలు ఖర్చు పెడిగితే రూ.40 వేలు ఆదాయమూ రాని పరిస్థితి ఉంటుంది. అన్నివిధాలా ఆదుకుంటామని సీడ్స్ అప్పగిస్తున్న కంపెనీలు తర్వాత రైతులను పట్టించుకోవడం లేదు. దీంతో రైతులకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

అగ్రిమెంట్లు రాస్తేనే రైతులకు న్యాయం

మొక్కజొన్న సీడ్స్ అందిస్తున్న కంపెనీలు రైతులకు అగ్రిమెంట్లు రాయాలి. సీడ్స్ వల్ల రైతులు నష్టపోతే ఆ నష్టాన్ని కంపెనీలు భర్తీ చేయాల్సి ఉంటుంది. సీడ్స్ కంపెనీలు అగ్రిమెంట్లు రాయకుండా రైతులకు సీడ్స్ అంటగడుతున్నాయి. దిగుబడి వస్తే తమ కంపెనీ గొప్ప అని చెప్పుకుంటున్నాయి. రైతులు నష్టపోతే మాత్రం పట్టించుకోవడం లేదు. నష్టపోయిన రైతులు కంపెనీ ప్రతినిధుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ప్రయోజనం లేకుండాపోతోంది. దెందులూరు, పోలవరం, చింతలపూడి ఇతర నియోజకవర్గాల్లో ప్రతియేటా ఈ విధంగా వందలాది మంది రైతులు నష్టపోతున్నారు. వ్యవసాయాధికారుల వద్దకు వెళ్లినా ఎటువంటి ప్రయోజనమూ లేకుండాపోతోంది. సీడ్స్ కంపెనీలను వ్యవసాయ శాఖాధికారులు ఏమాత్రం అదుపుచేయని పరిస్థితి ఉంది. ఇటీవల జరిగిన డిఆర్‌సి సమావేశంలో ఇదే విషయంపై ఎంఎల్‌ఎలంతా ముక్తకంఠంతో ప్రశ్నించారు. తన నియోజకవర్గంలో 50 మందికిపైగా మొక్కజొన్న సీడ్స్ కంపెనీల బాధితులు ఉన్నట్లు పోలవరం ఎంఎల్‌ఎ చెప్పడం సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది. నిబంధనల ప్రకారం అగ్రిమెంట్లు ఎందుకు రాయించడం లేదని వ్యవసాయాధికారులను ప్రజాప్రతినిధులంతా నిలదీశారు. ఈ ఏడాది సీడ్స్ కంపెనీలు అగ్రిమెంట్లు రాసి సీడ్స్ అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తగు చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖాధికారులు చెప్పారు. అగ్రిమెంట్లపై ఇప్పటి నుంచే వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది. అలాకాకుండా ప్రతియేటా మాదిరిగానే వ్యవసాయశాఖ వ్యవహరిస్తే రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఈసారైనా సీడ్స్ కంపెనీలు అగ్రిమెంట్లు రాసేవిధంగా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకుంటారో, లేదో చూడాల్సి ఉంది. అంతేకాకుండా కమర్షియల్ సాగులో మొక్కజొన్న పంటను కొనుగోలు చేస్తున్న కొంతమంది వ్యాపారులు రైతులకు సొమ్ము ఇవ్వకుండా ఎగనామం పెడుతున్నారు. ఇలాంటి మోసాలపైనా అధికారులు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

అగ్రిమెంట్లు రాయకుండా సీడ్స్ అంటగడుతున్న కంపెనీలు
నాసిరకం సీడ్స్‌తో రైతులకు తీవ్ర నష్టాలు
ప్రతియేటా వందల సంఖ్యలో రైతుల పరిస్థితి అగమ్యగోచరం
జిల్లాలో దాదాపు లక్షకుపైగా ఎకరాల్లో మొక్కజొన్న సాగు
గడిచిన డిఆర్‌సి సమావేశంలో ఇదే అంశంపై ఎంఎల్‌ఎల ప్రశ్నలు
మొక్కజొన్న సాగుకు మళ్లీ రైతులు సన్నద్ధం.. అధికారులు చర్యలు తీసుకునేనా

మేమెలా బతికేది

పెన్షన్ల తొలగింపు అన్యాయం
కలెక్టరేట్ వద్ద వికలాంగ పెన్షన్‌దార్ల ధర్నా
వికలాంగులతో కూటమి ప్రభుత్వం చెలగాటం
సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్తున్న వికలాంగులు

ప్రజాశక్తి - భీమవరం

'20 ఏళ్ల నుంచి పెన్షన్లు తీసుకుంటున్నాం.. అప్పటి నుంచి ఉన్న అర్హత ఇప్పుడు లేదని పెన్షన్లు తొలగిస్తే మేమెలా బతికేది' అంటూ వికలాంగ పెన్షన్‌దార్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ పట్ల కనికరం లేకుండా వ్యవహరించడం అన్యాయమని, తమ పొట్ట కొడితే మట్టి కొట్టుకుపోతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ కారణాలతో నిలుపుదల చేసిన పెన్షన్లు అన్ని పునరుద్ధరించాలని, లేనిపక్షంలో తమంతా ఇంటిల్లిపాది అన్యాయం అయిపోతామని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక కలెక్టరేట్ వద్ద వికలాంగుల వైకల్య శాతం తగ్గించడాన్ని, పెన్షన్ల తొలగించడాన్ని నిరసిస్తూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. స్థానిక తిరుమల విద్యాసంస్థల దగ్గర నుండి తొలగించిన పెన్షన్లు పునరుద్ధరణ చేయాలని, ఇచ్చిన నోటీసులు వెనక్కి తీసుకోవాలని, పాత సదరం సర్టిఫికెట్లు కొనసాగించాలని, కొత్త సదరం సర్టిఫికెట్లు రద్దు చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చేపట్టిన ధర్నాకు సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మద్దతు ప్రకటించి మాట్లాడారు. వికలాంగుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. వికలాంగుల అవసరాలకు అనుగుణంగా పెన్షన్లు, సౌకర్యాలు పెంచాల్సిందిపోయి ఉన్నవాటిని తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం మారినప్పుడు వికలాంగుల సర్టిఫికెట్లు రద్దు చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వం పెన్షన్లు తొలగించడం మానుకోవాలని, లేనిపక్షంలో వికలాంగుల పోరాటంలో సిపిఎం ప్రత్యక్షంగా పాల్గొంటామని హెచ్చరించారు. ఎన్‌పిఆర్‌డి జిల్లా కార్యదర్శి అల్లాడి నటరాజు మాట్లాడుతూ వికలాంగుల పట్ల కూటమి ప్రభుత్వ వ్యవహారశైలి తీరు దారుణమన్నారు. రీఅసెస్‌మెంట్ పేరుతో వైకల్యం శాతం తగ్గించడం చూస్తే కూటమి వికలాంగుల అంటే కూటమి ప్రభుత్వానికి చిన్నచూపు ఉన్నట్లు స్పష్టమవుతోందన్నారు. వికలాంగులకు ఉచిత బస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి పి.వి.ప్రతాప్, పట్టణ పౌర సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ వికలాంగులకు బోగస్ పేరుతో అర్హులైన వారిని కూడా తొలగించడం బాధాకరమన్నారు. వికలాంగులకు రేషన్ ఇంటికి ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అమలు చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మద్దా శ్రీనివాస్, సంఘాల నేతలు నందారి రమేష్, బొమ్మిడి అప్పారావు, మేడపాటి రాఘవేంద్రరెడ్డి, కొత్త వీర్రాజు, జంపా సూరిబాబు పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

నరసాపురం: రీవెరిఫికేషన్ పేరుతో వికలాంగుల పింఛన్ల తొలగింపు ప్రక్రియ ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు డిమాండ్ చేశారు. ఆయన సోమవారం స్పందన కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసి రాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన సదరం ధ్రువీకరణ పత్రం కలిగి ఉండి చాలాకాలంగా వికలాంగుల పింఛను తీసుకుంటున్న కొందరికి ఇటీవల పింఛన్లను తొలగిస్తున్నట్లు నోటీసులు పంపడం దారుణమన్నారు. ప్రభుత్వం ఈ ప్రక్రియ కొనసాగిస్తే చాలామంది వికలాంగులు తమ పింఛన్లు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగం లేదా అధిక ఆస్తులు కలిగిన వారు పింఛన్లు పొందితే, అలాంటి వాటిని నిలుపుదల చేస్తే అభ్యంతరం లేదని అన్నారు. అయితే రీ వెరిఫికేషన్ పేరుతో అర్హులైన చాలామందిని తొలగించటం సమంజసం కాదని అన్నారు. వికలాంగుల పట్ల మానవత్వం చూపి వారి పింఛన్లను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్, ట్రూఅప్ ఛార్జీలు ఉపసంహరించుకోవాలి

28న విద్యుత్ అమరవీరుల ప్రతిజ్ఞ దినం
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలను, పెంచిన ఛార్జీలను తక్షణం ఉపసంహరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా సెక్రటేరియట్ సమావేశం కేతా గోపాలన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ ఒకవైపు ట్రూఅప్ ఛార్జీల పేరుతో, మరోవైపు పెంచిన విద్యుత్ ఛార్జీల వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలో కూటమి నాయకులు విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ ఛార్జీలు మాత్రమే కాకుండా వాటికి అదనంగా ట్రూఅప్ ఛార్జీలు కూడా విపరీతంగా పెంచారని మండిపడ్డారు. ఇవి మాత్రమే కాకుండా కొత్తగా రూ.13 వేల కోట్లు విద్యుత్ భారాలను ప్రజలపై వేయాలని రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోందని తెలిపారు. ఒకవైపు నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోతుంటే మరోవైపు ఇలాంటి విద్యుత్ భారాలను ప్రజలపై మోపడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవినీతికర ఒప్పందాలను ఉపసంహరించుకోవాలన్నారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్ల బిగింపు ఆలోచనను విరమించుకోవాలన్నారు. ఈ నెల 28న విద్యుత్ అమరవీరుల ప్రతిజ్ఞ దినాన్ని వామపక్షాలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత 2000వ సంవత్సరంలో తెలుగుదేశం ప్రభుత్వం విపరీతంగా కరెంటు ఛార్జీలు పెంచడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజా పోరాటాలు జరిగాయని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో ప్రజలపై కాల్పులు జరపడంతో తెలుగుదేశం ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పలేదని, ఆ విషయాన్ని సిఎం చంద్రబాబు గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. తక్షణం విద్యుత్ భారాలను తగ్గించాలని, లేనిపక్షంలో అలాంటి ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, జిల్లా సెక్రటేరియట్ సభ్యులు కౌరు పెద్దిరాజు, బి.వాసుదేవరావు, చింతకాయల బాబూరావు, పి.వి.ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం

ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ వద్ద ధర్నాలో రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హరేరామ్

ప్రజాశక్తి - భీమవరం

ఆక్వా రైతులు అనేక కష్టనష్టాల మధ్య కొట్టుమిట్టాడుతున్నారని, వారి సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్ డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ వద్ద రైతుసంఘం ఆధ్వర్యంలో ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరేరామ్ మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాల వల్ల రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న రొయ్యలపై అధిక పన్నుల భారం పడిందన్నారు. అన్ని కౌంట్లకూ రూ.60 నుండి రూ.80 వరకు ధర తగ్గి తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఒకపక్క నాణ్యమైన సీడ్ దొరకక, ఫీడ్ ధరలు అధికంగా ఉన్నప్పటికీ, విద్యుత్‌కు ప్రభుత్వం ప్రకటించిన రూ.1.50 పైసలు చిన్న, సన్నకారు రైతులకు వర్తింపు కాక నష్టాలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అమెరికా నుండి ఉత్పత్తి అవుతున్న ఉత్పత్తులపై మన దేశంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం మోడీ ఎటువంటి సుంకాలూ లేకుండా దిగుమతులు చేసుకోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో కిలారి తవిటి నాయుడు, కొప్పిశెట్టి సత్యనారాయణ, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, ఇంజేటి శ్రీనివాస్, కేతా జ్యోతిబసు, పాలా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ధర్నాలో నినదిస్తున్న ఆక్వా రైతులు

జిల్లా కేంద్రంపై కేంద్ర మంత్రి, ఎంఎల్ఏ స్పష్టతివ్వాలి

అంజిబాబుపై విశ్వాసంతోనే మూడు పార్టీలు మారినా జనం గెలిపించారు
డబ్బున్న వారి దగ్గరే ప్రభుత్వ భవనాలు ఉండాలనుకోవడం సరికాదు
శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జిల్లా కేంద్రం భీమవరం నుండి తరలిస్తున్నట్లు వస్తున్న వార్తలపై కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంఎల్ఏ అంజిబాబు ప్రజలకు స్పష్టమైన హామీ ఇవ్వాలని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు కోరారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మోషేన్‌రాజు మాట్లాడుతూ జిల్లా కేంద్రం భీమవరంలో ఉంటే ఏడు నియోజకవర్గాల ప్రజలకు అనువుగా ఉంటుందని గత ప్రభుత్వం భీమవరం జిల్లా కేంద్రంగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. జిఒ నెం.124 జారీ చేసి గునుపూడిలో 20 ఎకరాల భూమి కేటాయించడమే కాకుండా నిర్మాణానికి రూ.100 కోట్లు ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. కలెక్టరేట్ నిర్మాణంలో భాగంగా ఆర్‌అండ్‌బి ఆధ్వర్యాన టెండర్ పిలిచారన్నారు. అయితే ఉండి ఎంఎల్ఏ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు గతంలో కలెక్టరేట్‌ను కాళ్ల మండలం పెదఅమిరంలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించారని, దానిపై భీమవరం ఎంఎల్ఏ అంజిబాబు కలెక్టరేట్ ఎక్కడికీ వెళ్లదని, భీమవరంలోనే ఉంటుందని చెప్పారని గుర్తు చేశారు. అయితే పదేపదే కలెక్టరేట్ తరలింపు మాట ఎందుకు వస్తుందని ప్రశ్నించారు. తాజాగా పెదఅమిరంలోని మూడున్నర ఎకరాల ఇరిగేషన్ భూమిలో కలెక్టరేట్ శంకుస్థాపనకు రావాలని రఘురామకృష్ణరాజు సిఎం చంద్రబాబును కలిసినట్లు ప్రచారం సాగుతోందని తెలిపారు. ఇరిగేషన్ భూముల్లో నిర్మాణాలు వద్దని సుప్రీంకోర్టు చెప్పిందని గుర్తు చేశారు. దీనిరీత్యా ఇరిగేషన్ భూమిని రెవెన్యూకు బదలాయించాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిసిందన్నారు. జిల్లా కేంద్రంపై నిర్ణయం తీసుకోవాలంటే ఏడుగురు ఎంఎల్ఏలు కలిసి నిర్ణయం తీసుకోవాలని, అదీ ప్రజాభీష్టం మేరకే ఉండాలని తెలిపారు.

పి-4 పేరిట నిర్మాణం సరికాదు

రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలనకు తీసుకొచ్చిన పి-4 కార్యక్రమం మంచిదని, అయితే దీనికింద కలెక్టరేట్ భవన నిర్మాణం చేపడతామనడం సరికాదని, ఎవరి దగ్గర డబ్బుంటే వాళ్ల దగ్గరే ప్రభుత్వ భవనాలు ఉండాలా అని మోషేన్‌రాజు ప్రశ్నించారు. భీమవరం ఎంఎల్ఏ అంజిబాబు ఒక్క విషయాన్ని గుర్తుంచుకోవాలని, ఆయన మూడు పార్టీలు మారినా మూడుసార్లు ఎంఎల్ఏగా గెలిపించారని, ప్రజలకు ఆయన పట్ల ఉన్న విశ్వాసాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. కలెక్టరేట్ భీమవరం నుంచి తరలిపోతే అంజిబాబుకు అది మాయని మచ్చగా మిగులుతుందని అన్నారు.

స్పష్టత ఇవ్వకపోతే ప్రజాఉద్యమం తప్పదు

కలెక్టరేట్ తరలింపుపై అధికార పార్టీ నాయకులు, జిల్లా అధికారులు స్పష్టత ఇవ్వకపోతే ప్రజలంతా ఉద్యమిస్తారని మోషేన్‌రాజు తెలిపారు. కలెక్టరేట్‌పై మౌనం వీడి మిగిలిన రాజకీయ పార్టీ నాయకులు, ప్రజాసంఘాలు పోరాటానికి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యతివ్వాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పిజిఆర్‌ఎస్ ఫిర్యాదులకు తగిన ప్రాధాన్యత ఇచ్చి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి పిజిఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందన్నారు. పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దిష్ట గడువులోగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒక్కో సందర్భంలో ఫిర్యాదుల పరిష్కారానికి కొంత సమయం అవసరం ఉన్నప్పుడు సంబంధిత విషయాన్ని ఫిర్యాదుదారులతో అధికారులు స్వయంగా మాట్లాడాలన్నారు. ఫిర్యాదులు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబంధిత శాఖకు ఎండార్స్ పంపాలన్నారు. అర్జీలు రీఓపెన్ కాకుండా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు పిజిఆర్‌ఎస్‌లో జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 248 అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి, జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, వయోవృద్ధుల ట్రిబ్యునల్ కమిటీ సభ్యులు మేళం దుర్గాప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగరాణి

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తాం

జిఒ నెం. 77 రద్దుచేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ కల్పించాలి
ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గణేష్, ప్రసాద్
భీమవరం కలెక్టరేట్ వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన ధర్నా
జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలి వచ్చిన విద్యార్థులు

ప్రజాశక్తి - భీమవరం

విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం విద్యారంగంలో ఉన్న సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందని, సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.గణేష్, టి.ప్రసాద్ హెచ్చరించారు. ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలు, హాస్టల్స్‌లో ఎస్‌ఎఫ్‌ఐ నెలరోజుల పాటు సమస్యలపై సర్వే చేస్తుంది. ఈ నేపథ్యంలో దృష్టికొచ్చిన అనేక సమస్యలు జిల్లా అధికారులకు విన్నవించారు. అయితే అటు ప్రభుత్వం గానీ ఇటు ప్రభుత్వాధికారులు గానీ స్పందించకపోవడంతో సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో విద్యార్థులు తరలివచ్చి నేలపై బైఠాయించి సమస్యలపై నినదించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నేతలు గణేష్, ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా కేంద్రం భీమవరంలో ఒక పీజీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. తాడేపల్లిగూడెంలో ఉన్న ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ పీజీ క్యాంపస్‌లో కోర్సుల సంఖ్య పెంచాలన్నారు. దగ్గులూరు మెడికల్ కళాశాలకు, పాలకొల్లు గురుకుల పాఠశాలకు, నర్సాపురంలో ఆక్వా యూనివర్సిటీకి నిధులు కేటాయించి శాశ్వత భవనాలు నిర్మించాలన్నారు. దీని ద్వారా జిల్లాలో అనేక మందికి ఉన్నత విద్యావకాశాలు అందుతాయన్నారు. జిల్లాలో శిథిలావస్థలో ఉన్న పలు ప్రభుత్వ పాఠశాలలను నిర్మించాలని డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థులకు మెస్ ఛార్జీలను రూ.3 వేలకు పెంచాలని, పెండింగ్లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు బకాయిలను విడుదల చేయాలన్నారు. జిఒ నెంబర్ 77ను రద్దు చేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులందరికీ ఉచిత బస్సు పాస్‌లు ఇవ్వాలని, భీమవరం సమీపంలో ఉన్న గ్రంధి వెంకటేశ్వరరావు జూనియర్ కళాశాలకు రోడ్డు మార్గం నిర్మించాలని కోరారు. అనంతరం బిసి వెల్ఫేర్ అధికారి వెంకటేశ్వరరావుకు, సోషల్ వెల్ఫేర్ అధికారులకు, డిఇఒ కార్యాలయ సూపరిటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకులు వాసు, లక్ష్మణ్, శ్రీనివాస్, ఈశ్వర్, నాగేంద్ర, సింధు, శ్రావణి, రోహిత్, గోవింద్, నవీన్ సత్యసాయి, ధీరజ్, సాయి, హేమంత్, సాయి తేజ పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు, విద్యార్థులు

పెన్షన్లు ఇచ్చే స్థితిలో కేంద్రం లేకపోవడం సిగ్గుచేటు

ఎపిఆర్‌పిఎ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాజు

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఎపిఆర్‌పిఎ నేతలు

భీమవరం : ఇపిఎఫ్ పెన్షన్లు ఇచ్చే స్థితిలో కేంద్రం లేకపోవడం సిగ్గుచేటని ఎపిఆర్‌పిఎ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాజు విమర్శించారు. భీమవరం కలెక్టరేట్ వద్ద జాతీయ స్థాయి పెన్షనర్ల సంఘం ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ కేంద్ర ఇపిఎఫ్‌లో 8 కోట్ల మంది పెన్షనర్లు ఉన్నారని, దీనిలో కేవలం కోటి మందికి కూడా పెన్షన్ ఇవ్వలేని స్థితిలో కేంద్రం ఉందన్నారు. ఇపిఎఫ్ కేంద్ర సంస్థలో ఎనిమిది లక్షల కోట్లు ఇపిఎఫ్ మొత్తం ఉందని, దీని నిమిత్తం ప్రతి ఏడాది రూ.54 వేల కోట్లు వడ్డీ రూపంలో వస్తున్నా.. కేవలం రూ.14 వేల కోట్లు మాత్రమే పెన్షన్లు చెల్లిస్తున్నారని చెప్పారు. ఈ పెన్షన్లు 230 నుండి 4 వేల వరకు మాత్రమే చెల్లిస్తున్నారని, రాష్ట్రాలు చెల్లిస్తున్న సామాజిక ఫ్రెండ్షిప్ పెన్షన్ల కంటే చాలా తక్కువ ఇస్తున్నారని వాపోయారు. జిల్లా కార్యదర్శి వై.అజయ్ కుమార్ మాట్లాడుతూ సెప్టెంబర్ 17వ తేదీన విజయవాడ లో జరిగే ఎపిఆర్‌పిఎ రాష్ట్ర సదస్సుకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి వేలాదిగా తరలి రావాలన్నారు. కార్యదర్శి చిరంజీవి మాట్లాడుతూ కనీస పెన్షన్ రూ.9 వేలు డిఎతో ఇవ్వాలని, భార్యాభర్తలు ఇద్దరికీ వైద్య ఖర్చులు ఇవ్వాలని, అలాగే రైల్వే ప్రయాణంలో అన్ని రకాల రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అధికారులకు వినతి పత్రం అందజేశారు. కె.సత్యనారాయణ మూర్తి, కె.రాధాకృష్ణ, ఐ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

డిఎస్‌సిలో నాగసాయి శ్రీలతకు 2వ ర్యాంక్

ఆచంట : ఇటీవల జరిగిన డిఎస్‌సి పరీక్షల్లో చల్లపల్లి నాగసాయి శ్రీలత ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 93.86 శాతం మార్కులు సాధించి రెండవ స్థానంలో నిలిచింది. శ్రీలత తండ్రి చల్లపల్లి శ్రీనివాసరావు ఆచంట మండల విద్యాశాఖాధికారి-1గా పనిచేస్తున్నారు. ఈమె తల్లి చల్లపల్లి నాగమణి గృహిణి కాగా శ్రీలత అక్క లక్ష్మీ శ్రావణి కూడా డిఎస్‌సి పరీక్షల్లో 80.36 శాతం మార్కులు సాధించింది. కాగా శ్రీలత స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రెండవ స్థానం సాధించడం సంతోషంగా ఉందని, కొంతకాలం ఈ ఉద్యోగం చేసిన అనంతరం గ్రూప్స్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అయ్యి మంచి ఉద్యోగం సాధించి, సమాజానికి సేవ చేయాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. శ్రీలత ర్యాంక్ సాధించడం పట్ల ఆచంట ఎంఎల్ఏ పితాని సత్యనారాయణ, ఆచంట మండల పరిషత్ అధ్యక్షురాలు దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, మండల విద్యాశాఖాధికారి-2 రాజేంద్రప్రసాద్, మండలంలోని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, అభినందనలు తెలిపారు.

రజకులపై దాడులు అరికట్టాలి

రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి మడక రాజు

ప్రజాశక్తి - భీమవరం

సామాజిక సేవా వృత్తిలో ఉన్న రజకులపై నేటికీ దాడులు జరుగుతున్నాయని, వీటిని అరికట్టాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి మడక రాజు అన్నారు. రజకులపై దౌర్జన్యాలు, అక్రమ కేసులు, మహిళలు, బాలికలపై అత్యాచారాలు, హత్యలు అరికట్టాలని కోరుతూ కలెక్టరేట్‌లో జిల్లా అధికారులకు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ సమాజంలో అగ్రవర్ణాలకు చెందిన వారూ రజకుల శ్రమను తగిన వేతనం అడగడం కూడా నేరంగా భావిస్తూ రజకుల శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు యండమూరి నాగేంద్ర మాట్లాడుతూ తక్షణమే రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, సబ్సిడీపై రెండు లక్షల లోన్లు కల్పించాలని, చదువుకున్న రజక యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దొడ్డిపట్ల అమ్మురావు, జిల్లా బాధ్యులు మల్లిపూడి వెంకటేశ్వరరావు, ముచ్చుపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉదయం కేఫ్ ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అభివృద్ధి చెందుతున్న భీమవరం పట్టణంలో ఎన్నో కార్పొరేట్ సంస్థలు తరలివస్తున్నాయని, ఉదయం కేఫ్‌ను మన పట్టణంలో ప్రారంభించుకోవడం అభినందనీయమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. జెపి రోడ్డులోని అడ్డ వంతెన వద్ద సోమవారం ఉదయం కేఫ్‌ను ఎంఎల్ఎ అంజిబాబు ప్రారంభించారు. కేఫ్ నిర్వాహకులు అడ్డాల వంశీ రాజు, ముదునూరి వంశీకృష్ణ రాజు, దంతులూరి పవన్ వర్మ, చిదురు శ్రీహర్ష, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - నరసాపురం

పిజిఆర్ఎస్‌లో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 64 ఫిర్యాదులు అర్జీదారుల నుంచి స్వీకరించినట్లు తెలిపారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో మూడు వినతులు అందాయని తహశీల్దార్ కె.రాజకిషోర్ తెలిపారు. భూ సమస్య పరిష్కరించాలని కోరుతూ ఒకటి, ముత్యాలపల్లి గ్రామంలో మరో చౌకడిపోని ఏర్పాటు చేయాలని కోరుతూ ఒక వినతి వచ్చాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సి.హెచ్.త్రిశూలపాణి, డిప్యూటీ ఎంపిడిఒ మేడిది నవీన్ కిరణ్, పలు శాఖల అధికారులు ఉన్నారు.

ఉల్లాస్ అక్షరాంధ్ర శిక్షణ

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం సమైక్య కార్యాలయంలో సోమవారం ఉల్లాస్ అక్షరాంధ్ర అక్షరాస్యతపై వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎపిఎం అమీర్ ఉస్సేన్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా నోడల్ అధికారి కెవివి.సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో డిఆర్‌డిఎ గ్రూపులో ఉన్న 2,500 మంది నిరక్షరాస్యులైన మహిళలను గుర్తించి వారికి ప్రతి పది మంది లెర్నర్లకు ఒక్కొక్క వలంటీర్‌ను ఏర్పాటు చేయటం జరిగిందని చెప్పారు. మండలంలో 250 మంది వలంటీర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిక్షణానంతరం పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గణపవరం ఎంపిడిఒ ఆర్.బేబీశ్రీలక్ష్మి, ఎంఇఒ జి.బాలయ్య, ఆర్‌డిఎ సిబ్బంది పాల్గొన్నారు.

దేశ ప్రగతిలో టెక్నాలజీది కీలకపాత్ర

ఎఫ్లానిక్స్ సిఇఒ దాసరి రామకృష్ణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పరిశోధనల జోరుతోనే వైజ్ఞానిక పురోగతి సాధ్యమని ఎఫ్లానిక్స్ ప్రయివేట్ లిమిటెడ్ సిఇఒ దాసరి రామకృష్ణ సూచించారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి బిటెక్‌లో ప్రవేశాలు పొందిన ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ప్రాంగణంలోని రవీంద్ర కళాభారతి ఆడిటోరియంలో ఇండక్షన్ ప్రోగ్రామ్‌ను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి దాసరి రామకృష్ణ మాట్లాడుతూ దేశ ప్రగతిలో టెక్నాలజీ ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. విద్యార్థులు అంతర్జాలంలో స్వేచ్ఛగా చేస్తే మనకు తెలియని ఎన్నో కొత్త విషయాలను నేర్చుకోవచ్చని సూచించారు. ఇంజినీరింగ్ చేసే విద్యార్థుల కొలువులకు కొదవలేదని చెప్పారు. విద్యార్థులు ఇప్పటినుంచే వయసుతో తాత్కాలిక ఆనందాలకు లొంగిపోతే భవిష్యత్తు అంధకారమవుతుందని తెలిపారు. సద్బుద్ధి, సంకల్పం, పట్టుదల, కృషి వంటి వాటిని తమ లక్ష్య సిద్ధికి సోపానాలుగా మలచుకున్న విద్యార్థులు విజయ శిఖరాలను సులువుగా అధిరోహించగలరని చెప్పారు. ఏ విషయాన్నైనా అవలోకించే ప్రపంచ స్వరూపాన్ని మార్చేస్తుందని, విద్యార్థులు సమాజం ఎదుర్కొంటున్న కఠిన సవాళ్లను అధిగమించేందుకు నూతన ఆవిష్కరణలు రూపకల్పనకు కృషి చేయాలని వివరించారు. ఎపి నిట్ ఇన్‌ఛార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్. డాక్టర్ ఎన్.వి.రమణారావు, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్, డీన్ అకడమిక్ డాక్టర్ కె.హిమబిందు, డాక్టర్ ఎస్.జయరామ్ మాట్లాడారు. ఈ ఇండక్షన్ కార్యక్రమం సెప్టెంబర్ ఒకటి వరకు కొనసాగనుందన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్టాండ్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రతి ఊరికి ఆర్‌టిసి బస్సు రావాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని, అదే లక్ష్యంతో తమ ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. సోమవారం మండలంలోని చినమిరం గ్రామ పంచాయతీ ఎన్‌టిఆర్ కాలనీ ఎదురుగా ఆర్‌టిసి బస్టాండ్‌కు సోమవారం ఎంఎల్ఎ అంజిబాబు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతంలో భీమవరం హాస్పిటల్ సహకారంతో నూతన బస్టాండ్‌ను నిర్మించడం అభినందనీయమని, ప్రయాణికులు ఈ బస్టాండ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అతి త్వరలోనే అందుబాటులోకి తీసుకు వచ్చేలా పనులు వేగవంతం చేయాలని అన్నారు. దాతలు ముందుకు వచ్చి అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహశీల్దార్ రావి రాంబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గణపవరం మండలాన్ని పశ్చిమలోనే ఉంచాలి

అఖిలపక్షం ఆధ్వర్యాన కలెక్టర్‌కు వినతి

గణపవరం : మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలోనే ఉంచాలని, ఏలూరు జిల్లాకు మారిస్తే ప్రాంతాలు తప్పవని అఖిలపక్ష మండల నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం భీమవరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గణపవరం నుంచి భీమవరం 24 కిలోమీటర్ల దూరమని అన్నారు. అదే ఏలూరు వెళ్లాలంటే 60 కిలోమీటర్లు ప్రయాణం చేయాలని తెలిపారు. ప్రజలకు అవసరమైన విద్య, వైద్యం, ముదునూరు, నీటి పారుదల శాఖలు జిల్లా కేంద్రం భీమవరంలో ఉన్నాయని, ఏలూరులో కలిపితే సహించేది లేదని అన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు ఇందుకూరి రామకృష్ణంరాజు, కూసంపూడి సురేందర్ కుమార్ రాజు, సంధ్యా రామలింగరాజు, కునిరెడ్డి సోమేశ్వరరావు పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని మేడపాడు పరిధి పెదగరువు, ఆర్యపేట గ్రామాలలో విద్యుత్ లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలని స్థానిక ప్రజల ఫిర్యాదు చేసిన నేపథ్యంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యాన ఆయా గ్రామాలలో అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. పాలకొల్లు ఎడిఇ రామకృష్ణ, యలమంచిలి ఎఇ వంశీ కిరణ్ ప్రారంభించారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

గల్లంతైన యువకుని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం, కేపీ పాలెం బీచ్‌లో గల్లంతైన యువకుని మృతదేహం సోమవారం లభ్యమైందని ఎస్ఐ జి.వాసు తెలిపారు. సంఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొత్తపాలెం చెందిన కొత్తపల్లి శ్రీహర్ష(19) తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం బీచ్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో సముద్ర అలల్లో స్నానం చేస్తూ అలల ఉధృతికి ప్రమాదవశాత్తు లోనకు కొట్టుకు వెళ్లి గల్లంతయ్యాడు. పేరుపాలెం సౌత్ బీచ్ లోని వాష్‌రూమ్ బీచ్ వద్ద మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99180
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పలుచోట్ల స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - గణపవరం

ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ రైస్ కార్డులను సోమవారం స్థానిక పంచాయతీ ఆవరణలో లబ్ధిదారులకు ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు పారదర్శకతతో మరింత మెరుగైన సేవలందించడానికి వీలుగా కార్డులు ఉపయోగపడతాయని చెప్పారు. ఎటిఎం కార్డు సైజులో ఉన్న కార్డులు అందరూ ఉపయోగించుకోవాలని చెప్పారు. గణపవరం తహశీల్దార్ వైకెవి.అప్పారావు మాట్లాడుతూ మండలంలో 20 వేల మందికి కార్డులు అందజేయటం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో గణపవరం ఎంపిడిఒ ఆర్.బేబీ శ్రీలక్ష్మి, గ్రామ సర్పంచి మూరా అలంకారం, పంచాయతీ కార్యదర్శి డిఎస్ఆర్.ప్రసాద్, కూటమి నాయకులు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, ఆర్ఐ గోపి పాల్గొన్నారు.

గణపవరం : స్మార్ట్ కార్డులు అందజేస్తున్న ఎంఎల్ఎ ధర్మరాజు

ఆచంట : కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని నియోజకవర్గ ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆచంట గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి కోట సరోజిని అధ్యక్షతన కొత్త రేషన్ కార్డు పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభించారు. కార్యక్రమంలో పితాని పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ పంపిణీ మరింత పారదర్శంగా, జవాబుదారీతనంగా నిర్వహించాలనే లక్ష్యంతో పాత కార్డుల స్థానంలో రాజముద్రతో ఎటిఎం కార్డు సైజులో ముద్రించి క్యూఆర్ కోడ్ కలిగిన కొత్త రేషన్ కార్డులను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, ఎంపిటిసిలు బాలం లీల సుబ్రహ్మణ్యం, దాసిరెడ్డి పుణ్యావతి, తమ్మినీడి పృథ్వీకుమార్, పార్టీ మండల అధ్యక్షులు చిలుకూరి సీతారాం, కూటమి నాయకులు జవ్వాది బాలాజీ శ్రీనివాస్, వాటర్ డిస్ట్రిబ్యూషన్ ఛైర్మన్లు పాల్గొన్నారు.

పెనుమంట్ర : అధికారులు, రేషన్ డీలర్లు ప్రజల మన్ననలు పొందేలా పనిచేయాలని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. సోమవారం పెనుమంట్ర పంచాయతీ కార్యాలయం వద్ద నూతన స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ పంపిణీలో పారదర్శకత, ఇబ్బందులు తొలగించేందుకుగాను అధునాతన టెక్నాలజీతో కూడిన స్మార్ట్ కార్డులు పంపిణీ చేసిందని అన్నారు. సచివాలయ సిబ్బంది సకాలంలో లబ్ధిదారులకు క్యూ ఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయాలని అన్నారు. ప్రభుత్వం వివిధ పథకాలతో పాటు రేషన్ కార్డులు కూడా మహిళల పేరుతోనే జారీ చేసిందని, మహిళలకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని ఆయన అన్నారు. నియోజకవర్గంలో కొన్ని టెక్నికల్ సమస్యల వల్ల కొంతమందికి కార్డులు రాలేదని, త్వరలోనే వారికి కూడా కార్డులు పంపిణీ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి టి.ప్రియాంక, తహశీల్దార్ వై.రవికుమార్, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విజయం సాధించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళుతున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు దక్కుతుందని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పెంటపాడు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో, తాడేపల్లిగూడెం రూరల్, టౌన్‌కు 54,716 క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రైస్ కార్డులు ఎంఎల్ఎ చేతుల మీదుగా ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిజెపి కన్వీనర్ ఈతకోట తాతాజీ, మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, తహశీల్దార్ ఎం.సునీల్‌కుమార్, జెడ్‌పిటిసి ఎం.ఆంజనేయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



దేవస్థానం ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న వెంకటేశ్వరరావు

కుమార స్వామి దేవస్థానం ఛైర్మన్‌గా వెంకటేశ్వరరావు

ఆచంట : కరుగోరుమిల్లి కుమారస్వామి దేవస్థానం ఛైర్మన్‌గా ముత్యాల వెంకటేశ్వరరావుతోపాటు మరో 8 మంది మెంబర్లతో ఆలయ కార్య నిర్వహణ అధికారి రామచంద్ర కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ తనయుడు పితాని వెంకట్ కుమారస్వామి దేవస్థానం సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, సర్పంచి అల్లం పద్మావతి, సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

తగ్గిన వరద ఉధృతి

ప్రజాశక్తి - యలమంచిలి

గత వారం రోజులుగా వరద నీటిలో చిక్కుకున్న కనకాయలంక కాజ్ వే సోమవారం మధ్యాహ్నాంకి వరద పూర్తిగా తగ్గడంతో ఎట్టకేలకు కాజ్వే బయటపడింది. దీంతో నిన్నటి వరకు భయం భయంగా పడవలలో ప్రయాణాలు సాగించిన స్థానిక ప్రజలు యథాస్థితిగా తమ ప్రయాణాలను కొనసాగించడానికి వీలు కలిగింది. ఐతే వరద పోయినా.. బురద మిగిలింది అనే చందాన లంక గ్రామాల్లో రహదారులపై ఎక్కడికక్కడ బురద నిలిచిపోవడంతో దాన్ని తొలగించడానికి పంచాయతీ అధికారులు రంగంలోకి దిగారు.

వెంపటాపునకు అభినందన పురస్కారం

ప్రజాశక్తి - తణుకు

విజయవాడలోని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, కళయజ్ఞ వారు ఆదివారం నిర్వహించిన శ్రామిక జీవన సౌందర్యం అనే అంశంతో రాష్ట్ర స్థాయి చిత్రకళా ప్రదర్శన, వర్తమాన పరిస్థితుల్లో చిత్రకారుడి పాత్రపై సెమినార్‌లో తణుకుకు చెందిన ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ వెంపటాపు చిత్రించిన ఉడ్ డిజైనర్ చిత్రం పులువురి ప్రశంసలు అందుకుంది. రాష్ట్ర స్థాయిలో 40కిపైగా చిత్రకారులు పాల్గొని శ్రామికుల్ని, వారి శ్రమని హృద్యంగా చిత్రాలు మలిచి ప్రదర్శించారని వెంపటాపు తెలిపారు. ఈనాడు కార్టూనిస్ట్ శ్రీధర్, ఎస్‌వి యూనివర్సిటీ అధ్యాపకులు డాక్టర్ సాగర్‌గిన్నె, యోగివేమన యూనివర్సిటీ హెచ్‌ఒడి డాక్టర్ మృత్యుంజయరావు, కళాయజ్ఞ ఏలూరి శేషబ్రహ్మం, చిత్రకళావధాన్ డాక్టర్ ఉదయ్‌కుమార్‌లు వెంపటాపును అభినందించి ఘనంగా సత్కరించారు.

విద్యార్థులకు డ్రాయింగ్‌లో శిక్షణ

ప్రజాశక్తి - కాళ్ల

ప్రాథమిక స్థాయి నుంచి డ్రాయింగ్‌లో మెళకువలు నేర్చుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు ఆర్.రవికుమార్ అన్నారు. సీసలి స్పెషల్ మోడల్ స్కూల్లో విద్యార్థులకు డ్రాయింగ్‌లో మెళకువలు నేర్పడం కోసం శిక్షణ తరగతులు సోమవారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతో పాటు చిత్రలేఖనంపై కూడా శిక్షణ ఇస్తున్నామని, శిక్షణా తరగతులు విద్యార్థులకు ఎంతో మేలు చేస్తాయని దొడ్డనపూడి హైస్కూల్ పిటిఎ మాస్టర్ నిమ్మల సాయినాద్ పేర్కొన్నారు. బాలబాలికలకు చిత్రాలు గీయడంలో ఆసక్తిని పెంపొందించేలా కృత్యాలు చేయించారు. పిల్లలకు డ్రాయింగ్ అభ్యాసం వల్ల ఊహా శక్తి పెరగటం, క్రమశిక్షణ, ఒక అభ్యుదయ అలవాటుగా మారితే మిగతా సబ్జెక్టులు గణితం, జియోగ్రఫీ సమ్స్ రాని వారు కూడా నేర్చుకునేందుకు సులభంగా ఉండే అవకాశం ఉంటుందని ఉపాధ్యాయులు బిఆర్ఎంకె.స్వామి వివరించారు. కార్యక్రమంలో పిఎస్.విష్ణు ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు చిత్రలేఖనంలో శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

ఆరోగ్యకర సమాజానికి పాటు పడాలి

కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఫణిధర్

తణుకు : ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం కోసం యువత ముందుండాలని శ్రీచిట్టూరి ఇంద్రయ్య స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వ.ప్ర) ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఆర్‌కె.ఫణిధర్ సూచించారు. సోమవారం స్థానిక శ్రీచిట్టూరి ఇంద్రయ్య స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వ.ప్ర)లో టిబి ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా కళాశాలలో తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రి, కళాశాల ఎన్ఎస్ఎస్ వారి సంయుక్త ఆధ్వర్యంలో క్షయ వ్యాధి(టిబి) నిర్మూలనపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్ర ఆసుపత్రి నిపుణులు సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్(టిబి) ఆర్ఎస్.చైతన్య మాట్లాడుతూ టిబి ఒక సంక్రమణ వ్యాధి అని దీని ప్రధాన లక్షణాలు నెలకుపైగా కొనసాగే దగ్గు, రక్తం కలిసిన కఫం, రాత్రిళ్లు చెమటలు పట్టడం, బరువు తగ్గడం, జ్వరం రావడం జరుగుతుందన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ పి.చిన్నిబాబు మాట్లాడుతూ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స సులభమని తెలిపారు. టిబి నిర్ధారణకు అందుబాటులో ఉన్న పరీక్షల ప్రాముఖ్యతను తెలియజేశారు. ఆర్.కృష్ణ, భవ్య మాట్లాడుతూ.. ఔషధాలను వైద్యుల సూచన మేరకు నిరంతరం వాడటం తప్పనిసరి అని చికిత్సను మధ్యలో ఆపేస్తే మల్టీడ్రగ్ రెసిస్టెంట్(ఎండిఆర్) టిబి వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వై.విజయ్‌కుమార్, రెడ్ క్రాస్ కన్వీనర్ డాక్టర్ కె.నాగభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ.. స్వచ్ఛత, సమయానికి చికిత్స, సామాజిక బాధ్యత ఈ మూడు కలిసినప్పుడే టిబి నిర్మూలన సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డి.కనకమహాలక్ష్మి, డాక్టర్ టి.సంధ్యారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏజెంట్ల మోసాలను దృష్టికి తీసుకురండి : ఎస్ఐ

ఉండి : అక్రమ మార్గంలో గల్ఫ్ దేశాలకు పంపి అక్కడ మోసపోయిన బాధితులు ఏజెంట్ల మోసాల గురించి తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించి న్యాయం చేసేందుకు తన వంతు కృషిచేస్తానని ఉండి ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా తెలిపారు. నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ సిస్టర్ లిస్సి జోసెఫ్ ఆదేశాల మేరకు మండలంలోని మహదేవపట్నంలో సోమవారం ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ కనుమూరి విజయదుర్గ అధ్యక్షతన గల్ఫ్ సమస్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఐ మహమ్మద్ నశీరుల్లా, విఆర్ఒ చిన్నారావు మాట్లాడుతూ గల్ఫ్ వెళ్లేవారు విజయవాడలోని ఎపి ఎన్ఆర్‌సి కార్యాలయంలో ప్రవాసాంధ్ర ఇన్సూరెన్స్ చేయించుకుంటే ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. న్యాయమూర్తి నల్లి శంకర్ మాట్లాడారు. కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా కోఆర్డినేటర్ రవికుమార్, రిటర్నీ మైగ్రేషన్ మహిళలు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి - భీమవరం

మట్టి వినాయకుల విగ్రహాల వినియోగంతో పర్యావరణం పరిరక్షణకు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో జిల్లా కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులకు వినాయకుని మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. నరసాపురం పట్టణానికి చెందిన విశ్వేశ్వర సేవా సదన్ డాక్టర్ కంచర్ల కాశీ విశ్వేశ్వరరావు, శిరిపుష్ప దంపతులు తయారు చేసిన వినాయకుని మట్టి విగ్రహాలను కలెక్టరేట్‌కు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల జలవనరులు కలుషితమై ఎన్నో జీవరాసుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. పర్యావరణాన్ని కాపాడే సంకల్పంతో విశ్వేశ్వర సేవా సదన్ తమ వంతు కృషిగా ఎన్నో ఏళ్ళ అనేక వేల మట్టి విగ్రహాలను తయారు చేసి ప్రజలకు అందించడం అభినందనీయమని, కంచర్ల కాశీ విశ్వేశ్వరరావు శిరీష దంపతులను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్ ఎఒ చంద్రశేఖర్, డిటి ఎం.సన్యాసిరావు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ నాగరాణి

పలుచోట్ల మట్టి విగ్రహాల పంపిణీ

భీమవరం : మట్టి విగ్రహాలు అందజేస్తున్న కలెక్టర్

వీరవాసరం : వినాయక చవితి పండుగను పురస్కరించుకొని సోమవారం వీరవాసరంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కొల్లా భాస్కరమ్మ, వీర రాఘవులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యాన పర్యావరణ పరిరక్షణలో భాగంగా సుమారు 3 వేల విగ్రహాలు గ్రామస్తులకు వివిధ ప్రాంతాల్లో స్టాల్స్ ఏర్పాటు చేసి అందజేశారు. ఈ కార్యక్రమంలో మద్దాల రాంబాబు, ఎంపిటిసి గుల్లిపల్లి విజయలక్ష్మి, మణికంఠ, పాల్గొన్నారు.

పాలకొల్లు : పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వామ్యం కావాలని మాజీ ఎఎంసి ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు చెప్పారు. పాలకొల్లు రైల్వే గేట్ వద్ద ఉన్న చవాకుల చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం వద్ద వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎఎంసి ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు విచ్చేసి 500 మట్టి గణపతిలను ప్రజలకు పంచిపెట్టారు. ట్రస్ట్ ఫౌండర్, ఛైర్మన్ చవాకుల సూర్య నరేష్ బాబును ఆయన అభినందించారు.

తాడేపల్లిగూడెం : పేరిచర్ల ఫౌండేషన్ సేవలు స్ఫూర్తి దాయకమని, పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత, వినాయక చవితి పూజలో సహజ సిద్ధమైన మట్టి ప్రతిమలతో గణపతిని పూజించాలని 316జి లయన్స్ పూర్వపు జిల్లా గవర్నర్ లయన్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. స్థానిక రామారావు పేటలో సోమవారం పేరిచర్ల ఫౌండేషన్ ఛైర్మన్, లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు ఏర్పాటు చేసిన మట్టి వినాయక ప్రతిమలు స్థానికులకు పంపిణీ చేశారు. తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ మద్దుకూరి మెహర్ ప్రసాద్ వినాయక విగ్రహాలు క్లబ్ సభ్యులకు అందించారు. మానవతా స్వచ్ఛంద సంస్థ జిల్లా నాయకులు జానకీరామరాజు మాట్లాడారు. కార్యక్రమంలో డైమండ్స్ వైస్ ప్రెసిడెంట్ చెన్నా రెడ్డి సతీష్, కార్యదర్శి కోటి విజయ్ కిషోర్, సభ్యులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : ప్రజలు తొలి పండుగ వినాయక చవితి వేడుకలు ఘనంగా జరుపుకోవాలని టిడిపి నియోజకవర్గ యువ నాయకులు పితాని వెంకట్ కోరారు. సోమవారం మండలంలోని మార్టేరులో జనసేన ఆధ్వర్యాన జరిగిన మట్టి గణపతి ప్రతిమల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని అందరికీ ప్రతిమలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వెలగల బుల్లి రామిరెడ్డి, జనసేన నాయకులు శ్రీనివాస్, కోయ కార్తిక్, షేక్ అలీ, బయ్యే బాలాజీ, కూటమి నాయకులు పాలా ప్రసాద్, వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

గణపవరం : పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను ప్రతిఒక్కరు ఏర్పాటు చేసుకోవాలని సప్తనిధి ఫౌండర్, ఛైర్మన్ కొల్లి స్వామి నాయుడు అన్నారు. సోమవారం బ్యాంకు ఆధ్వర్యంలో వినాయచవితి సందర్భంగా స్థానికులకు 500 మట్టి విగ్రహాలను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని అన్నారు. కార్యక్రమంలో గణపవరం బ్రాంచి ఇన్‌ఛార్జి కట్టా ఏడుకొండలు, సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దే విధంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలను వాడాలని మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు సూచించారు. ఈమేరకు 100 మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి బలుసులమ్మ కళ్యాణ మండపంలో ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. పురపాలక సంఘంలో సోమవారం జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో 100 మట్టి గణపతి విగ్రహాలను కమిషనర్ చేతుల మీదుగా మున్సిపల్ సిబ్బందికి, ప్రజలకు పంపిణీ చేశారు. మట్టి గణపతి విగ్రహాలను అందించిన టౌన్ ప్లాన్ ఆఫీసర్ వి.జగదీశ్వరరావును అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరు వై.వెంకట రమణ, డాక్టర్ ఎన్.రాజు, మేనేజర్ ఎం.రవి సుధాకర్, జి.సీతారాం, రెవెన్యూ ఆఫీసర్ పి.అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

మొగల్తూరు : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని ఆరోగ్య వర్షిని ట్రస్ట్ ఛైర్మన్ నాగిడి రాంబాబు ప్రజలకు సూచించారు. మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వినాయక చవితిని పురస్కరించుకుని మట్టి వినాయక ప్రతిమలు పాలవెల్లులు, వినాయకుని కథ పుస్తకాలను సోమవారం ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కొప్పడి వెంకట దుర్గ నాగరాజు, కట్ట మురళీ, కొల్లాటి దుర్గ ప్రసాద్, దొంగ శ్రీను, మూలస్వామి, సోమరాజు, సాయిబాబు, బాలకృష్ణ, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

తణుకు : పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతిఒక్కరు ముందుకు రావాలని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. తణుకు మైత్రి లయన్స్ క్లబ్, ఆర్యవైశ్య యువత సంయుక్త ఆధ్వర్యంలో మట్టితో తయారు చేసిన వెయ్యి వినాయక ప్రతిమలతోపాటు పూజాసామాగ్రిని సోమవారం ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ కార్యక్రమం తలపెట్టినా విఘ్నేశ్వరుడికి తొలుత పూజలు చేయడం ఆనవాయితీ అని, అలాంటి వినాయక చవితిని రాష్ట్రంలో, దేశంలో పెద్ద ఎత్తున జరుపుకొంటూ ఉంటారని అన్నారు. గతంలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాల కారణంగా భూకాలుష్యంతోపాటు వాయు, జలకాలుష్యం ఏర్పడుతోందని అన్నారు. దీంతో ఎన్నో దుష్పరిణామాలు ఎదురవుతున్నాయని, మట్టి విగ్రహాలే ఉపయోగించాలని సూచించారు. మంచి కార్యక్రమాలను తలపెట్టిన ఆర్యవైశ్య యువత నాయకులు, తణుకు మైత్రి లయన్స్ క్లబ్ నాయకులు రాజశేఖర్, రామచంద్రరరావు, నారాయణరావు, గమిని రాజా, మానేపల్లి శ్రీనివాస్‌లను ఎంఎల్ఎ అభినందించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తులా సేవలు అభినందనీయం

సర్పంచి కురెళ్ల వెంకటరత్నం

ప్రజాశక్తి - గణపవరం

పూర్ణిమ మెమోరియల్ హ్యూమన్ వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యాన ఫౌండర్ తులా ఆదినారాయణ చేస్తున్న సేవలు అభినందనీయమని జల్లికొమ్మర గ్రామ సర్పంచి కురెళ్ల వెంకటరత్నం అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు తులా ఆదినారాయణ వితరణ చేసిన భోజనం ప్లేట్లను ఆదినారాయణతో కలసి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఫౌండర్ తులా ఆదినారాయణ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం కటకం సుందర కుమార్ మాట్లాడుతూ స్కూల్ విద్యార్థులకు రూ.20 వేలతో భోజనం ప్లేట్లు అందజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. దాతలు సహకరిస్తే పాఠశాల మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఎంపిటిసి బుద్దాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

7 ఆంధ్ర నేవీ క్యాడెట్ల శిక్షణ

నరసాపురం : ఒరిస్సాలోని చిలక నేవి బేసిన్లో వచ్చే నెల 1 నుంచి పది రోజుల పాటు జరిగే సైలింగ్ సాహస యాత్రకు 7 ఆంధ్ర నేవి క్యాడెట్లు శిక్షణ పొందుతున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 100 మంది ఈ యాత్రకు హాజరుకానున్నారు. అందులో 7ఆంధ్రా నేవి యూనిట్ నుంచి క్యాడేట్లను ఎంపిక చేశారు. వారికి గత రెండు రోజులుగా నేవి యూనిట్ శిక్షణ ఇస్తుంది. పంట కాల్వలో బోటు సైలింగ్, బోటుకు తెరచాప ఎందుకు కడతారు, గాలి దిశను బట్టి ఏవిధంగా ప్రయాణించాలి అంశాలపై యూనిట్ లెఫ్టినెంట్ కమాండర్ సందీప్ రాత్రే శిక్షణ ఇచ్చారు.

శివలింగం ఆకారంలో లడ్డూ

నరసాపురం : వినాయక చవితి సందర్భంగా భక్తులు గణేశని చేతిలో పెట్టే లడ్డును శివలింగం ఆకారంలో వినూత్నంగా తయారుచేశారు. నరసాపురంకు చెందిన రాయల్ బ్యాకరీ యాజమాని అంబటి ప్రకాష్ ప్రతి సంవత్సరం వినాయక చవితిని పురస్కరించుకుని భారీగా లడ్డూలు తయారు చేయడం జరుగుతుంది. ఈ సంవత్సరం వినూత్నంగా లడ్డును నాలుగు రోజులు కష్టించి 25 కేజీల శివలింగం ఆకారంలో తయారు చేశామని, దీనికి భక్తుల నుండి విశేష ఆదరణ లభిస్తుందన్నారు. మరిన్ని శివలింగం లడ్డూలు కావాలని ఆర్డర్ చేస్తున్నారని స్వీట్ షాప్ ఓనర్ ప్రకాశ్ తెలిపారు.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA
O.S.250/24

Between:
Dontagani Srinivasa Rao ... Plaintiff
And
Garikapati Divya, W/o.Naga Subramanyam,
C/o.Garikapati Pothuraju, R/o.D.No.5-13,
Puttlacharuvu Post, Mandavalli (Md),
Eluru Dist., Pin: 521345.

ఈ నెంబరు దావాలో సదరు 8వ ప్రతివాదికి Court ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించిన అందుకొనక పోవుటచే పై Court వారు Paper Publication Order Pass చేసియున్నారు. సదరు 8వ ప్రతివాది ది.16-9-2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు పై Court వారి ఎదుట హాజరై ఆక్షేపణలువున్న యడల తెలుపుకొనవలెను. లేనియెడల వారి పరోక్షంన దావా తీర్మానించ బడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

వాయిదా : 16-9-2025

డా॥ డి.వి.రమణారెడ్డి
పి.శ్రీనివాసరావు
అడ్వకేట్స్, విజయవాడ.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA
I.A.1485/24
O.S.250/24

Between:
Dontagani Srinivasa Rao ... Petitioner/Plaintiff
And
Garikapati Divya, W/o.Naga Subramanyam,
C/o.Garikapati Pothuraju, R/o.D.No.5-13,
Puttlacharuvu Post, Mandavalli (Md),
Eluru Dist., Pin: 521345.
...Respondet No.8

ఈ నెంబరు Petition లో సదరు 8వ Respondent Court ద్వారా ఎన్నిసార్లు Notice లు పంపించిన అందుకొనక పోవుటచే పై Court వారు Paper Publication Order Pass చేసియున్నారు. సదరు 8వ Respondent ది.16-9-2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు పై Court వారి ఎదుట హాజరై ఆక్షేపణలువున్న యడల తెలుపుకొనవలెను. లేనియెడల వారి పరోక్షంన Petition తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

వాయిదా : 16-9-2025

డా॥ డి.వి.రమణారెడ్డి
పి.శ్రీనివాసరావు
అడ్వకేట్స్, విజయవాడ.

దస్తావేజు పోయినవి

నా క్లయింటు పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం, సుబ్బారావుపేట ఏరియా వాస్తవ్యులు గద్దే సుబ్బారావు గారి భార్య బేబి నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియచేయునది ఏమనగా నాక్లయింటు మరియు వారి బావగారైన కూచిపూడి వెంకటేశ్వరరావు గారు కలసి ది.24-04-2014 సం॥రం తేదీన కడకట్ల తాలూకు యల్.పి.నం.19/2004 దాఖలా ప్లాటు నం.70 తాలూకు 425 చ.గజముల స్థలమును రిజిస్టరు క్రియ దస్తావేజు నెం.3205/2014గా కొనుగోలు చేసియున్నారు. దరిమిలా నా క్లయింటు గారి బావగారు తన సగం వాటాకు సంబంధించి ది.20-10-2016 సం॥రం తేదీన హక్కు విడుదల దస్తావేజు నెం.8435/ 2016గా నా క్లయింటుకి వ్రాసియున్నారు. నా క్లయింటు ఆస్తికి సంబంధించిన దస్తావేజులు, వాటికి సంబంధించిన లింకు (క్రియ దస్తావేజు) ది.02-11-2004 నం.6648/2004 లు తీసుకుని ది.16-08-2025 సం.రం. తేదీన బ్యాంకు లోను నిమిత్తం న్యాయవాది వద్దకు వెళ్ళి చూసుకొనుసరికి సదరు ఒరిజినల్ దస్తావేజు నం.6648/2004 కనిపించియుండలేదు. ఇప్పటి వరకు వెతికిననూ కనిపించలేదు. కావున ఎవ్వరికైన నా క్లయింటు తాలుకు లింకు దస్తావేజు కనిపించిన, దొరికిననూ అప్పగించవలసిందిగా కోరడమైనది.

Kusuluri Siva Rama Krishna
Advocate, Tadepalligudem, W.G.Dt.
Cell: 9949076266, 9493480288

తాడేపల్లిగూడెం
తేది.25-08-2025